# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 19 నవంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## కోటి మంది మహిళలకు 'ఇందిరమ్మ చీరలు'

- సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి
- నేడు ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా లాంఛనంగా పంపిణీకి శ్రీకారం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రంలో కోటి మంది మహిళలకు కోటి చీరల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఇందిరమ్మ చీరలకు సంబంధించి మంత్రి ధనసరి అనసూయ సీతక్కతో పాటు ఉన్నతాధికారుల సమావేశంలో ముఖ్యమంత్రి మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతీ మహిళకు నాణ్యమైన చీరను అందించాలని అధికారులకు సూచించారు.రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ కోసం ఈ చీరలను పూర్తిగా సిరిసిల్ల చేనేత కార్మికులు తయారు చేస్తున్నారు. ఉత్పత్తి ఆలస్యం అవుతున్న నేపథ్యంలో, ఉత్పత్తికి అనుగుణంగా చీరల పంపిణీని ముఖ్యమంత్రి రు రెండు దశల్లో మిగితా 4వ పేజీలో

# హిడ్మా ఎన్‌కౌంటర్

- ఏపీ మారేడుమిల్లిలో భారీ ఎన్‌కౌంటర్
- మావోయిస్టు అగ్రనేత హిడ్మా, అతని భార్య సహా ఆరుగురు మృతి
- ఏపీ రాష్ట్రవ్యాప్తంగా దాడులు
- విజయవాడ, ఏలూరులలో కీలక నేతల బృందాలు అరెస్ట్
- విజయవాడలో 28 మంది పోలీసుల అదుపులో..



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మంగళవారం భద్రతా బలగాలు–మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో మోస్ట్‌వాం టెడ్ మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు మద్వి హిడ్మా మృతి చెందాడు. ఆయన భార్యతో కలిపి ఆరుగు రు హతమయ్యారు. మృతి చెందిన హిడ్మా సెంట్రల్ కమిటీ సభ్యుడు కాగా, ఆయన భార్య మడకం రాజే అలియాస్ రాజక్క డివిజన్ కమిటీ మెంబర్‌గా కొనసా గుతున్నారు. మృతి చెందినవారిలో చెల్లూరి నారాయణ అలియాస్ సురేశ్, టెక్ శంకర్, మల్లా, దేవే ఉన్నారు.

మారేడుమిల్లిలో మావోయిస్టులు ఉన్నట్లు పక్కా సమాచారం అందడంతో మంగళవారం ఉదయం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల మధ్య కాల్పులు జరిపా మని పోలీసులు చెబుతున్నారు. మృతి చెందిన మావోయిస్టుల నుంచి రెండు ఏకే 47 గన్‌లు, ఒక పిస్టల్, ఒక రివాల్వర్, ఒక సింగిల్ బోర్ ఆయుధం, పెద్ద ఎత్తున పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

రంపచోడవరం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏపీ ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ మహేష్ చంద్ర లడ్డా మాట్లాడుతూ.. మరణించిన వారిలో కేంద్ర కమిటీ సభ్యుడు, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) కంపెనీ వన్ కమాండర్ మడివి హిడ్మా, ఆయన భార్య రాజె అలియాస్ రాజక్క, లక్మల్ అలియాస్ చైతు, కమ్లు అలియాస్ కమలేష్, మల్ల అలియాస్ మల్లు, దేవె ఉన్నారని తెలిపారు.



**విజయవాడ సమీపంలో భారీ అరెస్టులు:**

వివిఐపిల కదలిక పెద్ద ఎత్తున ఉండే విజయవాడ నగరానికి అత్యంత సమీపంలోనే కృష్ణాజిల్లా పెనమలూరు మండలం కానూరు ఆటోనగర్‌లో పోలీసులు మెరుపు దాడి చేశారు. ఇంటెలిజెన్స్ సమాచారంతో ఆక్టోపస్, టాస్క్‌ఫోర్స్ బృందాలు నిర్వహించిన ఈ దాడిలో 28 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో హిడ్మా దళ బెటాలియన్ సభ్యులు 19 మంది, మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ రక్షణ సిబ్బంది 9 మంది ఉన్నట్లు చెబుతుండటం కలకలం రేపుతోంది.

**ఏలూరులో 15 మంది అదుపులోకి:**

ఏలూరు నగర శివార్లలోని మినీ బైపాస్ రోడ్డులోని ఒక గేటెడ్ కమ్యూనిటీలో షెల్టర్ తీసుకుంటున్న 15 మంది మావోయిస్టులను (వీరిలో ఐదుగురు మహిళలు) కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరి వద్ద 15 ఆయుధాలు లభించినట్లు తెలుస్తోంది.

**హిడ్మా నేపథ్యం:**

ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలోని పూర్వాటి గ్రామంలో జన్మించిన హిడ్మా 17 ఏండ్ల వయసులోనే మావోయిస్టు ఉద్యమం వైపు ఆకర్షితుడై పార్టీలో చేరాడు. మురియా తెగకు చెందిన ఆయనకు ఆంగ్లం, హిందీ, గోండు, తెలుగు, కోయ, బెంగాలీ భాషల్లో ప్రావీణ్యం ఉంది. మిగితా 4వ పేజీలో

## వికసిత్ భారత్ లక్ష్యాలకు

# తెలంగాణ భాగస్వామ్యం

- '2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణ' లక్ష్యం
- కేంద్ర సహకారం, మద్దతు కావాలి
- మెట్రో, మూసీ ప్రాజెక్టులకు అనుమతులివ్వండి.
- ప్రాంతీయ సదస్సులో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డివిజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన కేంద్రం






**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రపంచంలోనే బలమైన ఆర్థిక శక్తి కలిగిన దేశంగా భారత్ ఎదగాలన్న లక్ష్యాన్ని చేరుకోవడంలో తెలంగాణ కూడా భాగస్వామ్యం కావాలని బలంగా ఆకాంక్షిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి సంపూర్ణ సహకారం, మద్దతు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ లో జరిగిన తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, గోవా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలైన దాద్రా నగర్ హవేలీ, డామన్ అండ్ డ్యూల పట్టణాభివృద్ధి శాఖల మంత్రుల ప్రాంతీయ సదస్సును కేంద్ర మంత్రి శ్రీ మనోహర్ లాల్ ఖట్టర్ గారు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దేశం స్వాతంత్ర్యం సాధించి వంద సంవత్సరాల పూర్తి చేసుకునే 2047 నాటికి ప్రపంచంలోనే ఒక గొప్ప దేశంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందిన దేశంగా ముందుకు నడిపించాలని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు సంకల్పించిన వికసిత్ భారత్ లక్ష్యాలకు తమ వంతుగా భాగస్వామ్యం కావడానికి తెలంగాణ ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళుతోందని చెప్పారు. "దేశం ప్రగతిలో మెట్రోపాలిటన్ నగరాలు ఎన్నో రకాలుగా తోడ్పాటునందిస్తున్నాయి. దేశంలో వ్యవసాయ రంగంతో పాటు పట్టణీకరణ కూడా చాలా ముఖ్యమైన అంశం. ప్రత్యేకించి మెట్రోపాలిటన్ సిటీల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకమైన పాలసీని తీసుకురావాలి.

బలమైన ఆర్థిక శక్తి కలిగిన దేశంగా ఎదగడంలో 10 శాతం మేరకు తెలంగాణ నుంచి దోహదపడాలని నిర్దేశించాం. ఆ లక్ష్యాల సాధన కోసం తెలంగాణ రైజింగ్ 2047 బృహత్ ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. డిసెంబర్ 9 వ తేదీన ఆ విజన్ డాక్యుమెంట్ ను ప్రజలకు అంకితం చేయబోతున్నాం.2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణ ఎదగాలని నిర్దేశించుకున్నాం. ఆ లక్ష్యాల సాధన కోసం రాష్ట్రం తలపెట్టిన ప్రాజెక్టులకు కేంద్రం అనుమతులు మంజూరు చేస్తే మరింత వేగంగా ముందుకు వెళ్లగలం.

హైదరాబాద్ నగరానికి ప్రత్యేకత ఉంది. మిశ్రమ సంస్కృతి, మంచి వాతావరణం కలిగి ఉంటుంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారు హైదరాబాద్ ను రెండో రాజధాని చేయాలన్నారు. ఇప్పుడా ప్రస్తావన విషయానికి వెళ్లను కానీ, అభివృద్ధి విషయంలో తెలంగాణకు కేంద్రం సహకారం, మద్దతు ఉండాలి. ప్రధానంగా మెట్రో విస్తరణ, మూసీ నది ప్రక్షాళన, నగరానికి గోదావరి జలాల తరలింపు, కాలుష్య నివారణలో భాగంగా ప్రస్తుతం నగరంలో డీజిల్ తో నడుస్తున్న 3 వేల బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టడం, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, సివరేజీ ట్రీట్మెంట్ ప్లాంట్లు వంటి అనేక ప్రాజెక్టులు చేపట్టాం.

దేశంలో ఏర్పడిన జీసీసీల్లో 70 శాతం హైదరాబాద్ లో నెలకొల్పాయి. జీసీసీలు, డేటా సెంటర్లు, ఐటీ, ఫార్మా రంగాల్లో హైదరాబాద్ నగరం ఒక హబ్ గా మారింది. వీటికి అనుగుణంగా ఇప్పుడు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం. హైదరాబాద్ ను న్యూయార్క్, సింగపూర్, దుబాయ్ లాంటి నగరాలతో పోటీ పడాలని భావిస్తున్నాం. పెట్టుబడుల కోసం చైనా ప్లస్ 1 గమ్యస్థానాల కోసం దేశాలు అన్వేషిస్తున్న దశలో మెట్రోపాలిటన్ నగరాల్లో ఎయిర్ పోర్టులు, విద్యుత్, నీటి వసతి వంటి మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది. కేంద్ర మంత్రి కట్టర్ గారికి ముఖ్యమంత్రి గా చేసిన అనుభవం ఉంది. ముఖ్యమంత్రులకు ఎలాంటి కష్టాలుంటాయో వారికి ప్రత్యేకంగా తెలుసు. అందుకని రాష్ట్రాలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉంది.

దేశ ప్రధానమంత్రి రాష్ట్రాల ముఖ్యమంత్రులకు బడా భాయ్ లాంటి వారే. మెట్రో, మూసీ రివర్ ఫ్రంట్, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, తాగునీటి సమస్య, కాలుష్య నియంత్రణ వంటి అనేక విషయాలపై దృష్టిని సారించి రాష్ట్రానికి సహకరించాలి. రాజకీయాలు చేయాల్సిన సమయంలో రాజకీయాలు మాట్లాడొచ్చు. రాజకీయాలు ఇప్పుడు అసందర్భం. గడిచిన మూడు దశాబ్దాల కాలంలో ప్రభుత్వాలు వేరైనప్పటికీ విధానాలను అమలు చేయడంలో మార్పులేదు. కాకపోతే వాటిని మరింత పదును పెట్టి అమలు చేయడం జరిగింది." అని ముఖ్యమంత్రి గారు చెప్పారు. పట్టణాభివృద్ధి విషయంలో ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలన్న అంశంపై పలు రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖల సమావేశం హైదరాబాద్ లో ఏర్పాటు చేసినందుకు కేంద్ర మంత్రి కట్టర్ గారికి అభినందనలు తెలియజేశారు. ముఖ్యమంత్రి గారి విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి ఖట్టర్ సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్ మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం అతి త్వరలోనే అనుమతులు మంజూరు చేస్తుందని హామీ ఇచ్చారు.

# 8,9 తేదీల్లో తెలంగాణ రైజింగ్-2047 ఉత్సవాలు

- ప్రభుత్వ పాలసీలు ప్రకటిస్తాం
- బ్యాంకర్లు భాగస్వాములు కావాలి
- ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రైజింగ్–2047 ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ఈనెల ఎనిమిది, తొమ్మిది తేదీల్లో నిర్వహించబో తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. అన్ని రకాల ప్రభుత్వ పాలసీలను ప్రకటిస్తా మని చెప్పారు. ఈ భారీ కార్యక్రమంలో బ్యాంకర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని భాగస్వా ములు కావాలని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని బేగంపేటలో ఓ ప్రయివేటు హోటల్‌లో నిర్వహించిన ఎస్ఎల్‌బీసీ 47వ త్రైమాషిక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంగా 13 శాతం జీడీపీ పెరుగుదల టార్గెట్‌గా తెలంగాణ రైజింగ్–2047 రోడ్ మ్యాప్‌ను విడుదల చేయబోతున్నట్టు వివరించారు. ఏటా 10 శాతం చొప్పున పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యాన్ని సాధిస్తామని అన్నారు. తెలంగాణ అభివృద్ధి పట్ల ప్రభుత్వ కల ఏంటి, దాన్ని సాధించేందుకు ఎలాంటి ప్రణాళికలతో ముందుకు పోతున్నామనేది ఈ ఉత్సవంలో వివరిస్తామన్నారు. రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం, ఔటర్ రింగ్ రోడ్డుకు దాన్ని కలు పుతూ అనేక పారిశ్రామిక కారిడార్ల నిర్మాణం, మూసీ పునర్జీవనం వంటి అంశాలను వివరించి ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పెట్టుబ డిదారులను పెద్దఎత్తున ఆకర్షించ బోతున్నా మని చెప్పారు. బ్యాంకర్లు కార్పొరేట్ సంస్థల తోపాటు స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ), సూక్ష్మ మధ్యతరహా, చిన్న పరిశ్ర మలకు ప్రోత్సాహం అందించాలని కోరారు. ఈ రెండు రంగాలను ప్రోత్సహిం చడం ద్వారా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉపాధి లభించ డంతోపాటు సంపద సృష్టించ బడుతుందనీ, తద్వారా జీడీపీ పెరుగుతుందని అన్నారు.విద్య, వైద్య రంగాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించిందని భట్టి చెప్పారు. బ్యాంకర్లు సీఎస్‌ఆర్ నిధులను సీఎస్ మొదలు కలెక్టర్ వరకు, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శిని సంప్రదించి ఈ రంగాల్లో ఆ నిధులను ఖర్చు చేయాలని సూచించారు. విద్యను ప్రోత్సహిం చేందుకు మౌలిక సదుపాయాలు కల్పించడం తోపాటు, డిజిటలైజ్ ఎడ్యుకేషన్ అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు పోతుందని వివరించారు. వ్యవసాయ మౌలిక వసతుల నిధి కింద మంచి పురోగతి సాధించామన్నారు. తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నిజంగా మార్పు చేయాలంటే పంట కోత తర్వాతి మౌలిక సదుపాయాలు, ప్రాసెసింగ్ యూని ట్లు, సూక్ష్మ పంట నీరు, అనుబంధ రంగాల్లో బ్యాంకు రుణాలను మరింతగా పెంచాలని కోరారు. పంట రుణాలు సమర్థవంతంగా అందుతున్నప్పటికీ, వ్యవసాయ టర్మ్ లెండింగ్ అవసరానికి తగ్గట్టు లేదన్నారు. ఇది రైతులు ఆధునీకరించుకోవడం, వైవిధ్యం చేర్చు కోవడం, ఆత్మనిర్భర స్థాయి నుంచి సంపన్న స్థాయికి చేరడం సహాయపడదని చెప్పారు. ఈ లోటును బ్యాంకులు అత్యవసరంగా భర్తీ చేయాలని కోరారు. రూ. రెండు లక్షల వరకు పంట రుణ మాఫీ,

రైతు భరోసా, సాగునీటి ప్రాజెక్టులు, ఉచిత విద్యుత్ అందించామని వివరించారు. పామాయిల్‌తోపాటు ఇతర విభిన్న పంటలకు బ్యాంకులు ఎక్కువ మద్దతు ఇవ్వాలని సూచించారు. ఎంఎస్‌ఎంఈలు రాష్ట్రంలో ఉపాధి, ఆవిష్కరణలకు వెన్నెముకగా నిలుస్తున్నాయని చెప్పారు. భరోసాతో కూడిన, బలమైన ఎంఎస్‌ఎంఈ వ్యవస్థ వచ్చే దశాబ్దం తెలంగాణ రైజింగ్‌కు పునాది అని అన్నారు. 13 వేల కిలోమీటర్ల అంతర్గత రహదారుల నిర్మాణం, ఒక రూపాంతరక కార్యక్రమం ప్రస్తుతం జరుగుతోందనీ, ఇది రాష్ట్ర ఆర్థిక పటాన్ని సమూలంగా మారుస్తుందని చెప్పారు. దీన్ని బ్యాంకులు ప్రాధాన్య రంగ రుణ అవకాశంగా చూడాలని కోరారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ షెడ్యూల్....

- విడుదల చేసిన తెలంగాణ స్పీకర్..
- 19వ తేదీన తెల్లం వెంకట్రావ్, డాక్టర్ సంజయ్..
- 20వ తేదీన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, అరికెపూడి గాంధీల విచారణ




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విచారణకు సంబంధించి తాజాగా మరో షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 19, 20 తేదీల్లో నలుగురు ఎమ్మెల్యేలను విచారించనున్నట్లు ప్రకటించారు. భారత్ రాష్ట్ర సమితి నుంచి అధికార కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ల విచారణను స్పీకర్ చేపడుతున్నారు. ఈ ప్రక్రియ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జరుగుతోంది. ఈ విచారణల్లో ఫిర్యాదుదారులు (బీఆర్ఎస్ నాయకులు), ప్రతివాదుల తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపించనున్నారు. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేల విచారణ పూర్తయిన నేపథ్యంలో, ఈ నలుగురి విచారణ పూర్తి కాగానే, స్పీకర్ తన తుది నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉంది.

# జిన్నింగ్ మిల్లర్లతో ప్రభుత్వం చర్చలు సఫలం

- నేటి నుంచి యధావిధిగా పత్తి కొనుగోళ్ల ప్రక్రియ
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాల సంఘంతో జరిగిన చర్చలు సఫలమయ్యాయనీ, బుధవారం నుంచి యధావిధిగా పత్తి కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. త్వరలో అన్ని జిల్లాల్లోనూ జిన్నింగ్ మిల్లులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామనీ, మిల్లర్లకు ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా సహకారం అందిస్తా మని హామీనిచ్చారు. కేంద్ర ప్రభుత్వంతో, సీసీఐతో మిల్లర్లు పోరాడాలనీ, రైతులకు ఇబ్బందులు సృష్టించడం తగదని హితవు పలికారు. జిన్నింగ్ మిల్లర్ల సమస్యలపై నివేదిక తయారు చేసి కేంద్ర జౌలిశాఖ అధికారులకు పంపాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్‌ను ఆదేశిం చారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్ గుప్తా, జిన్నింగ్ మిల్లర్ల అసోసియేషన్‌తో మంత్రి తుమ్మల సమావేశమయ్యారు. జిన్నింగ్ మిల్లర్ల సమస్యలపై చర్చించారు. మిల్లర్లు తమ సమస్యలను మంత్రికి ఏకరువు పెట్టారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ..రైతుల సమస్యలను రెట్టింపు చేసేలా జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు సమ్మెకు దిగడం సమంజసం కాదన్నారు. జిన్నింగ్ మిల్లుల సమస్యలపై సమ్మెలాంటి విధానంతో కాకుండా సామరస్యంగా కేంద్రంతో పోరాడుదామని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోళ్లను 18 క్వింటాళ్లకు కుదిస్తే రాష్ట్ర ప్రభుత్వం 25 క్వింటాళ్లకు పెంచిందనీ, సేకరించే సోయా చిక్కుడు పరిమితిని ఎకరానికి 6.72 క్వింటాళ్లకు కుదిస్తే 10 క్వింటాళ్లకు పెంచి సేకరిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. కౌలు రైతులకు ఇబ్బందులు కలగకుండా నాఫెడ్ తీసుకొచ్చిన ఆధార్ గుర్తింపుతో పాటు మొబైల్ ఓటీపీతో కూడా కొనుగోళ్లు జరపాలని సూచించారు. కపాస్ కిసాన్ యాప్ పత్తి రైతులకు ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. రైతులు తమ పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే అక్కడ కూడా కేంద్రం మరో నిబంధన పెట్టిందన్నారు. అకాల వర్షాలు, మొంథా తుపాను వంటి సహజ విపత్తులు వచ్చి పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయినప్పటికీ అవన్నీ పట్టని కేంద్ర ప్రభుత్వం 12 శాతం తేమ మిగితా 4వ పేజీలో

## ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత

- ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఇద్దరి పిల్లల నిబంధన ఎత్తివేత ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉండకూడదన్న నిబంధనను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తొలగిస్తూ గవర్నర్ ఆమోదానికి పంపిన విషయం తెలిసిందే. తాజాగా గవర్నర్ ఈ ఫైల్‌పై సంతకం పెట్టడంతో ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలున్నా ....సర్పంచ్, వార్డ్ మెంబర్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేయొచ్చు. 1994లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జనాభా నియంత్రణ లక్ష్యంగా ఈ నిబంధనను తీసుకొచ్చారు.

## జాతీయ జల పురస్కారాల్లో తెలంగాణ నెంబర్ వన్

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు ప్రదానం


వివరాలు 4వ పేజీలో

## ఓపెన్ యూనివర్సిటీ 'డిజిటల్ హబ్'గా మార్పు..

- అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని 'నాలెడ్జ్ హబ్'గా తీర్చిదిద్దేందుకు చర్యలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వివరాలు 2వ పేజీలో

# పత్తి రైతులకు అన్యాయం



- కిసాన్ కపాస్ యాప్‌ను రద్దు చేయాలి.
- తేమ శాతం 20% వరకు కొనుగోలు చేయాలి
- ఎకరా పరిమితి 13 క్వింటాళ్లకు పెంచాలి
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్
- సీసీఐ అధికారులకు వినతిపత్రం సమర్పించిన బీఆర్ఎస్ బృందం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలోని పత్తి రైతుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిండా నిర్లక్ష్యం చేస్తున్నారని, పత్తి కొనుగోలు చేపట్టకపోవడం, మద్దతు ధర దక్కకపోవడం వంటి అంశాలపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో 50 లక్షల ఎకరాల్లో పండే పత్తి పంట సమస్యలు, తేమ శాతం బాధలు, పంట నష్టాలపై మంత్రివర్గ సమావేశంలో చర్చ లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు అండగా ఉంటామని, వారి సమస్యలు పరిష్కరించేదాకా పోరాటం చేస్తామని కేటీఆర్ ప్రకటించారు.

ఆదిలాబాద్ జిల్లాలో పత్తి రైతులను కలిసి వారి సమస్యలు విన్న అనంతరం, కేటీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ పార్టీ బృందం మంగళవారం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అధికారులను కలిసింది. పత్తి రైతుల సమస్యలపై సమగ్రమైన వినతిపత్రాన్ని వారికి సమర్పించింది.

ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. సీసీఐ విధించిన నిబంధనలపై తీవ్ర విమర్శలు చేశారు కాపస్ (కాపస్) యాప్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కనెక్టివిటీ, స్మార్ట్‌ఫోన్లు లేకపోవడం, సరైన శిక్షణ, అవగాహన కల్పించకపోవడంతో కొనుగోళ్లలో అనవసరమైన జాప్యం జరుగుతోందన్నారు. పాత పద్ధతిలోనే మార్కెట్ యార్డుకు వచ్చి నేరుగా అమ్ముకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది ఆదిలాబాద్‌లో భారీ వర్షపాతం, నవంబర్ 18 నాటికి 6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కావడంతో నల్లరేగడి నేలల్లో పండించే పత్తిలో తేమ శాతం సహజంగానే ఎక్కువగా ఉంటుందని కేటీఆర్ వివరించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 20–22 శాతం తేమ ఉన్నప్పటికీ కొనుగోలు చేయించామని గుర్తు చేస్తూ, సీసీఐ కూడా తేమ శాతం 20 వరకు ఉన్న పత్తిని మిగితా 4వ పేజీలో

# ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పించాలి..

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- రాజీవ్ నగర్ బస్తీ దవాఖాన, అంబేద్కర్ నగర్ యూపీహెచ్ సీల్లో ఆకస్మిక తనిఖీ



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రాజీవ్ నగర్ బస్తీ దవాఖాన, అంబేద్కర్ నగర్ యూపీహెచ్ సీల్లో మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ఆసుపత్రుల్లో ఓపీ రిజిస్టర్, ల్యాబ్, ఫార్మసీ, ఇమ్యూనైజేషన్ గది, ఇన్ పేషెంట్ గదులు, ఇతర గదులు, ఆవరణ పరిశీలించారు.వైద్య సేవలకు వచ్చిన రోగులతో మాట్లాడారు. ఏ ఏ పరీక్షలు చేశారు? వైద్యం పై ఆరా తీశారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారికి అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై వివరించాలని తెలిపారు. గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఇక్కడ వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర విధానాలు జంగిల్ రాజ్ పాలనకు పరాకాష్ట

- మావోయిస్టుల ఎన్‌కౌంటర్లన్నీ బూటకమే
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**బలగం టీవీ, హైదరాబాద్**

మావోయిస్టులను చంపుకుంటూ పోవడమంటే మానవ హననం తప్ప మరొకటి కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తీవ్రంగా విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు 'జంగిల్ రాజ్' (అడవి పాలన) పరిపాలనకు పరాకాష్ట అని ఆయన అభివర్ణించారు. మాడేరుమిల్లులో జరిగిన హిడ్మా ఎన్‌కౌంటర్, అంతకుముందు మావోయిస్టులపై జరిగిన ఎన్‌కౌంటర్లన్నీ ఫేక్ ఎన్‌కౌంటర్‌లే అని కూనంనేని స్పష్టం చేశారు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్లలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల పోలీసులు కూడా పావులుగా మారారని ఆయన ఆరోపించారు.

**చట్టబద్ధంగా విచారణ జరిపించాలి:**

బూటకపు ఎన్‌కౌంటర్‌లతో మనుషులను చంపుకునే వ్యవస్థ ప్రపంచంలో ఎక్కడా లేదని కూనంనేని అన్నారు. మావోయిస్టులు ఏదైనా నేరాలు చేసి ఉంటే వారిని అరెస్టు చేసి, చట్టబద్ధంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఫేక్ ఎన్‌కౌంటర్‌లు చేయడం విచారకరమని పేర్కొన్నారు. మావోయిస్టులపై జరుగుతున్న అన్ని ఎన్‌కౌంటర్లపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పోలీస్ స్టేషన్ గోడ దూకి పారిపోయిన ఎస్ఐ!

- లంచం తీసుకుంటుండగా ఏసీబీకి పట్టుబడటంతో వింత ఘటన
- మెదక్ జిల్లా టేక్మాల్‌లో ఘటన

**బలగం టీవీ, మెదక్**

మెదక్ జిల్లా టేక్మాల్ పోలీస్ స్టేషన్లో మంగళవారం అత్యంత వింతైన, నాటకీయ ఘటన చోటు చేసుకుంది. లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ) ఏకంగా పోలీస్ స్టేషన్ గోడ దూకి పారిపోవడానికి ప్రయత్నించారు. వివరాల్లోకి వెళితే.. ఒక కేసుకు సంబంధించి ఎస్ఐ రాజేశ్ ఫిర్యాదుదారుడి నుంచి రూ. 20 వేలు లంచం తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులు పోలీస్ స్టేషన్లోనే ఆయన్ని పట్టుకున్నారు. ఎస్ఐని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్న సమయంలో, ఆయన ఒక్కసారిగా పరుగు లంకించుకున్నారు. ఏసీబీ అధికారుల కళ్లుగప్పి ఎస్ఐ రాజేశ్ పోలీస్ స్టేషన్ గోడ దూకి తప్పించుకోవడానికి ప్రయత్నించాడు. అయితే, ఏసీబీ అధికారులు వెంటనే అప్రమత్తమై ఆయన్ని వెంబడించారు. కొంత దూరం తరుముకుంటూ వెళ్లి, చివరికి ఎస్ఐ రాజేశ్‌ను పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఎస్ఐ రాజేశ్ లంచం కేసులో ఏసీబీకి చిక్కాడని తెలియడంతో స్థానికులు పెద్ద సంఖ్యలో పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అవినీతి ఎస్ఐ పట్టుబడటాన్ని సంబరంగా భావించిన స్థానికులు, ఏకంగా పోలీస్ స్టేషన్ ముందు టపాసులు కాల్చి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## 'ఓటమికి పూర్తి బాధ్యత నాదే': ప్రశాంత్ కిషోర్

**బలగం టీవీ, హైదరాబాద్**

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర ఓటమిపై ఎన్నికల వ్యూహకర్త, 'జన్ సురాజ్' పార్టీ వ్యవస్థాపకులు ప్రశాంత్ కిషోర్ (పీకే) తొలిసారిగా స్పందించారు. తొలిసారి బరిలో దిగిన తమ పార్టీ ఖాతా కూడా తెరవకుండానే విఫలమవడానికి గల కారణాలపై ఆయన మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. "నిజాయితీగా తాము చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈ ఘోర ఓటమికి తాను పూర్తి బాధ్యత వహిస్తున్నాను" అని ప్రకటించారు. తప్పులను సరిచేసుకుని మరింత బలంగా ముందుకు వస్తామని, వెనక్కి వెళ్లే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని మార్చడంలో తాము విఫలమయ్యామని, అంతేకాకుండా ప్రజలను అర్థం చేసుకోవడంలో కూడా పొరపాటు జరిగిందని, అందుకు తానే బాధ్యత తీసుకుంటున్నానని ఆయన పేర్కొన్నారు. తాను ఆత్మపరిశీలన చేసుకుంటానని, ఒకరోజు మౌనవ్రతం పాటిస్తున్నానని తెలిపారు. తాము పొరపాట్లు చేసి ఉండవచ్చుగానీ, ఎలాంటి నేరం చేయలేదని పీకే స్పష్టం చేశారు. తాము కుల రాజకీయాలకు పాల్పడలేదని, హిందూ-ముస్లింల మధ్య చిచ్చు పెట్టలేదని, విష ప్రచారం సాగించలేదని, పేదలు, అమాయక ప్రజల ఓట్లు కొనుగోలు చేయలేదన్నారు. అవన్నీ చేసినవారు అందుకు తగిన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఒక ప్రభుత్వం ప్రజల కోసం రూ.40 వేల కోట్లు ఖర్చు చేస్తామని ప్రకటించడం ఇదే మొదటిసారి అని, ఆ కారణంగానే ఎన్డీయే విజయం సాధించిందని అన్నారు.

# ఓపెన్ యూనివర్సిటీ 'డిజిటల్ హబ్'గా మార్పు..

- అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని 'నాలెడ్జ్ హబ్'గా తీర్చిదిద్దేందుకు చర్యలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణలో విద్యా ప్రమాణాలను పెంపొందించడంతో పాటు విద్యా వ్యవస్థను మరింత మెరుగ్గ మార్చాలన్న లక్ష్యానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలను బలోపేతం చేయడంతో పాటు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఒక నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

ముఖ్యమంత్రి సమక్షంలో ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఎడ్యుకేషన్ అకాడమీ ఏర్పాటుకు సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ , కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ మధ్య అవగాహన ఒప్పందంకుదిరింది. కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్అధ్యక్షుడు, సీఈఓ ప్రొఫెసర్ పీటర్ స్కాట్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి గారు పరస్పరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ ఒప్పందంతో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిజిటల్ విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చెందనుంది. బోధన, అభ్యాసం, పరిశోధనలను మెరుగుపరచడానికి iDEA అత్యాధునిక డిజిటల్ హబ్‌గా పనిచేస్తుంది. టెక్నాలజీ ద్వారా నాణ్యమైన విద్య అందించేందుకు వీలు కలుగుతుంది. ఈ సమావేశంలో కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ అధ్యక్షుడు, సీఈఓ ప్రొఫెసర్ పీటర్ స్కాట్, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, BRAOU వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బనకచర్ల ప్రాజెక్టుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతివ్వొద్దు



- కేంద్ర జల్‌శక్తి మంత్రికి తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి

**బలగం టీవీ, హైదరాబాద్**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును ఏ రూపంలో నిర్మించాలనుకున్నా, దాన్ని గట్టిగా ప్రతిఘటిస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చిచెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వవద్దని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడారు.

ఏపీ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు తాము పూర్తిగా వ్యతిరేకమని, ఈ ప్రాజెక్టుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు మంజూరు చేయవద్దని కేంద్ర మంత్రిని కోరామని ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. అంతేకాకుండా, అల్మట్టి ఎత్తు పెంపు నిర్ణయం తెలంగాణకు నష్టదాయకమని, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎత్తు పెంపునకు అనుమతులు ఇవ్వవద్దని ఆయన కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. "కొంత కాలం నుంచి జల్‌శక్తి మినిస్ట్రీలో తెలంగాణకు చెందిన అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి. కేంద్రమంత్రిగా చొరవ చూపి వాటిని త్వరగా పరిష్కరించాలని కోరాము" అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు మొత్తం 90 టీఎంసీల నీటి కేటాయింపు కోరామని, అందులో భాగంగా, మొదటి విడతగా 45 టీఎంసీల నీటిని వెంటనే ఈ పథకానికి కేటాయించాలని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌ను, సీడబ్ల్యూసీ (సెంట్రల్ వాటర్ కమిషన్) ఛైర్మన్‌ను కోరినట్లు మంత్రి వెల్లడించారు. ఈ అంశం కేంద్రం వద్దే చాలా కాలంగా పెండింగ్‌లో ఉందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# కరెంటు నుంచి కాంటా దాకా అన్నీ సమస్యలే

- సీసీఐ 'తుగ్లక్' నిర్ణయాలతో రైతులు నష్టపోతున్నారు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు



**బలగం టీవీ, వరంగల్**

తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో కరెంటు నుంచి కాంటా (తూకం) దాకా అన్నీ సమస్యలేనని, ముఖ్యంగా పత్తి రైతులు తీవ్రమైన మనోవేదనకు గురవుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, కేంద్రంలోని బీజేపీ తప్పుడు విధానాల వల్ల రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆయన దుయ్యబట్టారు. మంగళవారం వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన హరీశ్ రావు, పత్తి రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు.

సమయానికి ఎరువులు అందవని, కరెంటు సరిగ్గా రాదని, రైతుబంధు, రుణమాఫీ, బోనస్, పంటల బీమా ఊసే లేదని విమర్శించారు. వరంగల్ డిక్లరేషన్‌లో చెప్పిన ఒక్క హామీ అయిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందా? అని ప్రశ్నించారు. సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) తీసుకున్న 'తుగ్లక్' వంటి పిచ్చి నిర్ణయాల వల్ల రైతులు రోడ్ల మీద పడే పరిస్థితి వచ్చిందన్నారు.

ఎల్1, ఎల్2, ఎల్3 విధానం మరియు కపాస్ యాప్‌లో 8 నుంచి 12 శాతం తేమ ఉండాలనే నిర్ణయాలతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జిన్నింగ్ మిల్లులు మూతపడటంతో, పత్తిని మద్దతు ధర (రూ. 8,100)కు అమ్ముకోలేక రైతులు క్వింటాల్‌పై రూ. 2000ల చొప్పున నష్టపోయి రూ. 6 వేలకే దళారులకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

60 సార్లు ఢిల్లీకి పోయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పత్తి రైతుల గురించి కేంద్రానికి విన్నవించే అవకాశం రాలేదా? సమయం లేదా? అని హరీశ్ రావు ప్రశ్నించారు. "ఉప ఎన్నికల్లో గెలవడానికి విచ్చలవిడిగా డబ్బులు పంచిన రేవంత్ రెడ్డి పత్తి రైతులకు కనీస మద్దతు ధర అందించలేకపోతున్నారు" అని విమర్శించారు. బడా కాంట్రాక్టర్లు, కార్పొరేట్లకు లాభం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం దిగుమతి సుంకాలు రద్దు చేసి విదేశాల నుంచి పత్తిని విచ్చలవిడిగా దిగుమతి చేసుకుంటూ రైతులకు అన్యాయం చేస్తుందని దుయ్యబట్టారు. 'బీజేపీ ఎంపీలు దిష్టిబొమ్మల కంటే నయం' అని, కేసీఆర్‌ని, బీఆర్ఎస్‌ని తిట్టడం తప్ప వారికి మరో పని చేతకాదని ఎద్దేవా చేశారు.

ఎల్1, ఎల్2, ఎల్3 విధానాన్ని, 8-12 శాతం తేమ విధానాన్ని సవరించి, కపాస్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలి. గత సంవత్సరం లాగే 12 క్వింటాళ్ల పత్తిని కొనాలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోయిన యాసంగిలో రైతులకు రావలసిన రూ. 1,100 కోట్ల బోనస్‌ను వెంటనే విడుదల చేయాలి.

ప్రభుత్వం కొన్న ధాన్యానికి రైతులకివ్వాల్సిన రూ. 1,400 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలి. వరంగల్ వరదల్లో నష్టపోయిన ఇళ్లకు ప్రకటించిన రూ. 15 వేల పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలి. "రేవంత్ రెడ్డి మేలుకోకపోతే తెల్ల బంగారం (పత్తి) తెచ్చి జూబ్లీహిల్స్ ప్యాలెస్ ముందు పోస్తాం" అని హరీశ్ రావు హెచ్చరించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తుందని, ఇటు రాష్ట్ర ప్రభుత్వాన్ని, అటు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

# రాజన్న సిరిసిల్ల ఆటో డ్రైవర్లకు కేటీఆర్ భరోసా..



- జిల్లాలో ఉన్న ఆటో అన్నలకు రూ. 5 లక్షల ప్రమాద బీమా నేనే కడుతా
- ఆటో అన్నలకు బాకీ పడిన రూ. 24 వేల బాకీ వెంటనే చెల్లించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంటకేటీఆర్ మరోసారి తన మంచి మనసు చాటుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఆటో డ్రైవర్ల అందరికీ 5 లక్షల రూపాయల ప్రమాద బీమా కోసం అవసరమైన ప్రీమియంను తానే చెల్లిస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఆటో డ్రైవర్లతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సోమవారం తెలంగాణ భవన్‌లో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో ఆటో డ్రైవర్లపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఆటో కార్మికులకు అండగా ఉన్నదని గుర్తు చేస్తూనే, ప్రస్తుత ప్రభుత్వం డ్రైవర్లకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేక, వారి సంక్షేమానికి చిత్తశుద్ధి చూపడం లేదని ఆరోపించారు.

**రూ. 5 లక్షల బీమాను రద్దు చేసి ఆటో అన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం ద్రోహం**

గత కేసీఆర్ ప్రభుత్వం అసంఘటిత రంగంలోని డ్రైవర్లందరికీ, కేవలం ఆటో డ్రైవర్లకే కాకుండా, రైతు బీమా తరహాలోనే రూ. 5 లక్షల ప్రమాద బీమా (యాక్సిడెంట్ ఇన్సూరెన్స్) అమలు చేసిందని కేటీఆర్ గుర్తు చేశారు. దురదృష్టవశాత్తూ ఎవరికైనా ప్రమాదం జరిగితే ఈ బీమా ద్వారా చాలామందికి డబ్బులు అందాయని తెలిపారు. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పోయిన అక్టోబర్ నెలలో ఈ బీమా ప్రీమియంను కట్టకపోవడంతో, ఆటో కార్మికులు ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ. 24,000 కాంగ్రెస్ బాకీ**

ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు నెలకు రూ. 1,000 చొప్పున (సంవత్సరానికి రూ. 12,000) సహాయం చేస్తామని హామీ ఇచ్చిందని, అయితే, ప్రభుత్వం ఏర్పాటై దాదాపు రెండేళ్లు కావస్తున్నా ఆ హామీని నిలబెట్టుకోలేదని కేటీఆర్ విమర్శించారు. "రెండేళ్లకు కలిపి ప్రతి ఆటో డ్రైవర్‌కు ప్రభుత్వం రూ. 24,000 బాకీ ఉంది. ముందు ఆ బాకీ కట్టండి అని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, 100 రోజుల్లో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన సంక్షేమ బోర్డును కూడా రెండేళ్లు అవుతున్నా ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వానికి డ్రైవర్ల పట్ల ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందని అన్నారు.

**రాజన్న సిరిసిల్ల డ్రైవర్లకు వ్యక్తిగతంగా బీమా నేనే కడుతా..**

మన రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉండే ఆటో డ్రైవర్లు దాదాపు 5,000 మంది ఉన్నారు. వీరికి ప్రభుత్వం ఇన్సూరెన్స్ కట్టడం లేదు కాబట్టి, పార్టీ తరపున వ్యక్తిగతంగా నేను కట్టిస్తాను" అని కేటీఆర్ ప్రకటించారు. ఇలా తాము బీమా కట్టడం ద్వారా రాష్ట్రమంతటా ప్రభుత్వానికి సిగ్గు వచ్చి, "వీళ్లు కడుతున్నప్పుడు మనం ఎందుకు కట్టొద్దు" అని రాష్ట్రవ్యాప్తంగా డ్రైవర్లందరికీ బీమా కట్టే ఆలోచన వస్తుందనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపడుతున్నానని ఆయన వివరించారు. జిల్లాలోని ఆటో, ఏడు సీట్ల (సెవెన్ సీటర్స్), అవసరమైతే ట్రాలీ డ్రైవర్లందరి వివరాలను (పేరు, ఫోన్ నంబర్, ఆధార్ నంబర్) కచ్చితంగా సేకరించి, బుధవారం సాయంత్రంలోగా అందజేయాలని కేటీఆర్ అక్కడి నాయకులకు, ఆటో యూనియన్ల వారికి సూచించారు. ఈ లిస్ట్ అందిన వెంటనే మూడు, నాలుగు రోజుల్లోనే బీమా చెల్లింపునకు చెక్కులు పంపిస్తానని ఆయన హామీ ఇచ్చారు.



# అర్జీలు సకాలంలో పరిష్కరించాలి..

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- మొత్తం 149 దరఖాస్తుల రాక..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే దరఖాస్తులను సకాలంలో, పూర్తిగా ఆన్‌లైన్‌లో పరిష్కరించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. వాటిని పెండింగ్‌లో పెట్టవద్దని స్పష్టం చేశారు. సోమవారం రోజున జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఇంచార్జి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 149 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారులు బాధ్యతగా తప్పనిసరిగా ప్రజావాణికి హాజరుకావాలని ఆదేశించారు. అదనంగా, నూతన వైద్యశాలలు, అంగన్వాడిలు, పాఠశాలల భవనాలకు వెంటనే మిషన్ భగీరథ నీరు మరియు విద్యుత్ కనెక్షన్లు అందించాలని సూచించారు. ఆధార్ కార్డుల కోసం ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు త్వరితగతిన బర్త్ సర్టిఫికెట్ జారీ చేయాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, డీఆర్డీఓ శేషాద్రి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ హాస్పిటల్‌లో సదరం శిబిరాల షెడ్యూల్ విడుదల..

**బలగం టీవీ, సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్లలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నందు నవంబర్-2025 నెలలో వివిధ వైకల్యాలకు సంబంధించి సదరం శిబిరాల నిర్వహణకు తేదీలు ఖరారు అయ్యాయి. వికలాంగులకు వైకల్య ధృవీకరణ పత్రాలు అందించే ఈ క్యాంపులు సంబంధిత వైద్యుల సూచనల మేరకు ఈ తేదీలలో నిర్వహించబడుతాయి.

**సదరం క్యాంపుల వివరాలు (నవంబర్ 2025):**

| క్రమసంఖ్య | క్యాంపు తేదీ | రోజు | విభాగం | కోడ్ |
|---|---|---|---|---|
| 1 | 21.11.2025 | శుక్రవారం | ఆర్తో | 53 |
| 2 | 24.11.2025 | సోమవారం | మానసిక | 15 |
| 3 | 25.11.2025 | మంగళవారం | మానసిక | 15 |
| 4 | 25.11.2025 | మంగళవారం | ఆర్తో | 53 |
| 5 | 26.11.2025 | బుధవారం | వినికిడి | 56 |
| 6 | 27.11.2025 | గురువారం | జనరల్ | 13 |
| 7 | 27.11.2025 | గురువారం | కంటిచూపు | 25 |
| 8 | 28.11.2025 | శుక్రవారం | ఆర్తో | 53 |
| 9 | 29.11.2025 | శనివారం | కంటిచూపు | 16 |

తెలిపిన తేదిలలో సదరం శిభిరంకు హాజరగు దివ్యాంగులు సంబంధిత మెడికల్ డాక్యుమెంట్లు, ఎక్స్-రే మరియు UDID అప్లికేషన్ ఫామ్, ఆధార్ కార్డ్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, ఫోన్ నెంబర్ తమ వెంట తీసుకుని ఉదయం 09.30 గంటలకు సదరం శిభిరంకు హాజరు కాగలరని తెలియ జేయుచున్నాము. సదరం క్యాంప్‌కు హాజరయ్యే దివ్యాంగుల పేర్లు, వివరాలను ఇప్పటికే పంచాయతీ కార్యదర్శి / మున్సిపాలిటీలలో బిల్ కలెక్టర్‌కు పంపడం జరిగింది. అందువలన, మండల అభివృద్ధి అధికారులు మరియు కమీషనర్లు (సిరిసిల్ల, వేములవాడ) తమ పరిధిలోని దివ్యాంగులకు ఈ సమాచారాన్ని తెలియజేసి, వారు సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా చూడవలసిందిగా కోరడమైనది.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే
- గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 28 ఫిర్యాదులు స్వీకరణ..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్. బి.గితే తెలిపారు. సోమవారం రోజున నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 28 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.



ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# భార్య, అత్త మీద కోపంతో పైరసీ వైపు ఇమ్మడి రవి..!

**బలగం టీవీ, హైదరాబాద్**



పైరసీ వెబ్‌సైట్‌లు ఐబొమ్మ , బప్పం టీవీల రూపకర్త, ప్రధాన నిర్వాహకుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇమ్మడి రవి అరెస్టు వెనుక వ్యక్తిగత కారణాలు, సంచలనాత్మక మలుపులు ఉన్నట్లు తెలుస్తోంది. డబ్బే సంపాదించలేవంటూ తన భార్య, అత్త చేసిన అవహేళనలే అతన్ని అక్రమ మార్గాలవైపు నడిపించాయని పోలీసుల విచారణలో వెల్లడైంది.

విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం, వెబ్ డిజైనర్ అయిన రవి 2016లో ఒక యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఉన్నత కుటుంబం నుంచి వచ్చిన ఆమె, రవి అరకొర సంపాదనను చూసి తరచూ డబ్బు సంపాదించడం చేతకాదంటూ అవహేళన చేసేవారట. ఆమె తల్లి (అత్త) కూడా ఇదే విధంగా మాట్లాడటంతో రవి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ అవమానాలను భరించలేని రవి, ఎలాగైనా డబ్బు సంపాదించి తన సత్తా నిరూపించుకోవాలనే పట్టుదలతో తన వెబ్ డిజైనింగ్ నైపుణ్యాలను ఉపయోగించాడు. దీని నుండే ఐబొమ్మ, బప్పం టీవీ వంటి పైరసీ వెబ్‌సైట్‌లకు రూపకల్పన జరిగింది. ఈ వెబ్‌సైట్ల ద్వారా బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తూ రవి అనతి కాలంలోనే ఊహించనంత స్థాయిలో అధిక మొత్తంలో డబ్బులు సంపాదించాడు.

అయితే, కోట్లు సంపాదించి చూపించినా రవితో కలిసి ఉండేందుకు అతని భార్య ఇష్టపడలేదు. దీంతో 2021లో వీరిద్దరూ విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత రవి తన మకాంను నెదర్లాండ్స్‌కు మార్చాడు. అక్కడి నుంచే తన పైరసీ సామ్రాజ్యాన్ని నడుపుతూ, కొత్త సినిమాలను వెంటనే వెబ్‌సైట్లలో విడుదల చేస్తూ కోట్ల రూపాయలు సంపాదించి, తన ఆదాయాన్ని గణనీయంగా పెంచుకున్నాడు.

ఈ విధంగా వ్యక్తిగత కక్ష సాధింపు, అవమానాలను తిప్పికొట్టాలనే ఉద్దేశంతో మొదలైన అతని ప్రయాణం చివరకు పైరసీ కింగ్‌పిన్‌గా నిలిచి పోలీసులకు పట్టుబడటానికి దారితీసింది.



# స్టేడియం కొరకు స్థలం పరిశీలన..

**బలగం టీవీ, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం కొరకు స్థలం మరియు అంచనాలు రూపొందించుట కొరకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు సుమారు రోజున స్థలం పరిశీలించిన పంచాయతీరాజ్ డి.ఇ విష్ణువర్ధన్, తహాశీల్దార్ నారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లేష్ యాదవ్, ఏ.ఈ సాయి తేజరెడ్డి, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్, ఆర్.ఐ మనోజ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కెనపల్లి ఉపేందర్, కన్నం మధు తదితరులు ఉన్నారు.

# హిడ్మా ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

దండ కారణ్యంలో పార్టీ శ్రేణుల్ని ముందుండి నడిపించడంలో ఆరితేరాడు. భారీ దాడులకు వ్యూహ కర్తగా గుర్తింపు పొందాడు. బస్తర్ ప్రాంతంలో దళంలో కీలక సభ్యుడిగా మారాడు. చిన్నవయసులోనే మావో యిస్టు

కేంద్ర కమిటీ సభ్యుడయ్యాడు. గెరిల్లా దాడుల వ్యూహకర్తగా పేరు సంపాదించుకున్నాడు. పీపుల్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కమాండర్‌గా, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగానూ పనిచేశాడు.

**రూ.6 కోట్ల రివార్డు**


దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా చేసిన హిడ్మా రెండు దశాబ్దాల్లో జరిగిన మావోయిస్టు కీలకదాడులకు సూత్రధారిగా గుర్తింపు పొందాడు. దంతేవాడ, సుక్మా పరిధిలో 30కి పైగా భారీ దాడులకు ఈయనే నేతృత్వం వహించారు. వీటిని దృష్టిలో ఉంచుకుని పలు రాష్ట్ర ప్రభుత్వాలు హిడ్మా పై రూ.6 కోట్ల వరకు రివార్డు ప్రకటించాయి.

అడవుల్లోని కేంద్ర బలగాల క్యాంపులపై మెరుపు దాడులు నిర్వహించడంలో నిష్ణాతుడిగా పేరు పొందాడు హిడ్మా. ఈ క్రమంలోనే మిలిటరీ దాడులకు మారుపేరైన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్ జీఏ)లో నంబరు 1 బెటాలియన్‌కు సారథ్యం వహిస్తున్నాడు. ప్రతి భారీ దాడిలో స్వయంగా హిడ్మానే పాల్గొంటాడు. ఈ క్రమంలో కేంద్ర బలగాలకు మోస్ట్ వాంటెడ్?గా మారిపోయాడు. గత రెండు దశాబ్దాల్లో ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో హిడ్మా ప్రమేయంతోనే చాలా దాడులు జరిగాయి. అనేక ఆపరేషన్లలో హిడ్మా స్వయంగా పాల్గొని 200 మందికి పైగా పోలీసు సిబ్బంది మృతికి ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమయ్యాడని తెలుస్తోంది.

2010లో ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడలో హిడ్మా జరిపిన దాడిలో 76 మంది సీఆర్?పీఎఫ్? జవాన్లు వీర మరణం పొందారు. 2013లో జైరామ్ ఘాటీలో జరిపిన మెరుపుదాడిలో 27 మంది ప్రాణాలు విడిచారు. అందులో పలువురు కాంగ్రెస్ నాయకులు కూడా ఉన్నారు. 2021లో సుక్మా-బీజాపుర్?లో జరిగిన మెరుపుదాడిలో 22 మంది భద్రతా సిబ్బంది అమరులయ్యారు. ఇలా వందలాది ప్రాణాలు తీయడంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా హిడ్మా పాత్ర ఉంది.

# నటి హేమకు మాతృవియోగం

బలగం టీవీ, హైదరాబాద్



ఫైల్‌ఫొటో

తెలుగు చిత్ర పరిశ్రమలో లేడీ కమెడియన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి హేమకు మాతృవియోగం కలిగింది. ఆమె తల్లి కోళ్ల లక్ష్మి (80) సోమవారం రాత్రి (నవంబర్ 17) తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధులతో పాటు పలు అనారోగ్య సమస్యలతో లక్ష్మి బాధపడుతున్నట్లు సమాచారం. తల్లి మరణవార్త తెలియగానే హేమ వెంటనే తన స్వగ్రామం రాజోలుకు చేరుకున్నారు. తల్లి పార్థీవ దేహాన్ని చూసి హేమ బోరున విలపించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తల్లితో కలిసి దిగిన పలు పాత ఫోటోలను హేమ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేస్తూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు పెద్ద ఎత్తున సంతాపం తెలియజేస్తున్నారు.

## దిగ్గజ దర్శకుడు రాజమౌళిపై కేసు నమోదు!

- **మహేశ్‌బాబు సినిమా టైటిల్ ఈవెంట్‌లో హనుమంతుడిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదు**
- **హిందువుల మనోభావాలు దెబ్బతీశారంటూ రాష్ట్రీయ వానర సేన సభ్యుల ఆరోపణ**

బలగం టీవీ, హైదరాబాద్



టాలీవుడ్ దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తాజాగా చిక్కుల్లో పడ్డారు. సూపర్‌స్టార్ మహేశ్‌బాబుతో ఆయన తీయబోయే తాజా చిత్రం టైటిల్ ప్రకటన ఈవెంట్ ఈ నెల 15వ తేదీన ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. ఈ ఈవెంట్‌లో రాజమౌళి చేసిన కొన్ని వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారి, ఆయనపై కేసు నమోదయ్యేందుకు దారి తీశాయి. రాజమౌళి ఈ ఈవెంట్‌లో హనుమంతుడిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆయన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలు దెబ్బ తీసేలా ఉన్నాయని ఆరోపిస్తూ రాష్ట్రీయ వానర సేన సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై పోలీసులు ఏ విధంగా చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది. వివాదాన్ని పక్కన పెడితే, ఎస్-ఎస్ఎంబీ 29 అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉన్న ఈ చిత్రానికి 'వారణాసి' అనే టైటిల్‌ను చిత్ర యూనిట్ ఖరారు చేసింది. ఈ చిత్రంలో మహేశ్‌బాబు 'రుద్ర' పాత్రలో, ప్రియాంక చోప్రా లిలి'మందాకిని'లిలిగా నటిస్తున్నారు. ప్రముఖ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' అనే పాత్రలో ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారు.

# జిన్నింగ్ మిల్లర్లతో ప్రభుత్వం చర్చలు సఫలం

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనను పెట్టడం దారుణమని విమర్శించారు. జిన్నింగ్ మిల్లులను ఎల్ 1 నుంచి ఎల్ 12 వరకు కేటగిరీలుగా విభజించడాన్ని తప్పుబట్టారు. కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకించిన జిన్నింగ్ మిల్లుర్లు పత్తి కొనుగోళ్లు నిలిపివేశారని గుర్తుచేశారు. రైతుల సమస్యలకు కేంద్ర ప్రభుత్వమే కారణమన్నారు. మిల్లర్లు కేంద్రంపై పోరాడాలిగానీ రైతులకు నష్టం కలిగించొద్దని కోరారు. పత్తి, సోయా, మొక్కజొన్న రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని పనిచేస్తుంటే ప్రభుత్వాన్ని విమర్శించడమే ధ్యేయంగా బీఆర్ఎస్ వ్యవహరించడాన్ని తప్పుబట్టారు. రైతులకు మేలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తూనే ఉన్నామనీ, కేంద్ర మంత్రులకు, అధికారులకు పదేపదే విజప్తులు చేశామని గుర్తుచేశారు. పత్తి రైతుల సమస్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కూడా చర్చించామని తెలిపారు. రైతుల విషయంలో తమకు మూడోవ్యక్తి జోక్యం అవసరం లేదనీ, రైతుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తున్నదని ఉద్ఘాటించారు.

# 'ఆంధ్రా కింగ్ తాలుకా' ట్రైలర్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్




ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని , భాగ్యశ్రీ భోర్సే జంటగా, రియల్ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో నటించిన చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలుకా'. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వంటి సెన్సిబుల్ చిత్రాన్ని అందించిన మహేశ్ బాబు పీ. ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. టైటిల్ ప్రకటన నుంచే మంచి బజ్ తెచ్చుకున్న ఈ సినిమా.. ఆ తర్వాత వచ్చిన టీజర్, పాటలతో అంచనాలను మరింతగా పెంచేసింది. మరో వారంలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో, మేకర్స్ తాజాగా మంగళవారం ఈ మూవీ ఆఫీసియల్ ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్ చూస్తుంటే సినిమా మ్యాటర్ గట్టిగానే ఉన్నట్లు తెలుస్తోంది.

ట్రైలర్ ప్రకారం.. ఈ సినిమా సూర్య అనే సినిమా హీరోకు వీరాభిమాని అయిన సాగర్ అనే మధ్య తరగతి యువకుడి కథగా తెరకెక్కినట్లు అర్థమవుతోంది. ఉన్న ఊరిలో ఎన్నో అవమానాలు భరించిన సాగర్.. తానేంటో, తన హీరో ఏంటో నిరూపించుకోవాలని డిసైడ్ అవ్వడం, అదే సమయంలో తన అభిమానిని కలవడం కోసం హీరో చేసే ప్రయత్నం చుట్టూ కథ అల్లుకున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రం ఔట్ అండ్ ఔట్ ఎమోషనల్ జర్నీగా ఉండనుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ట్రైలర్‌కు మంచి స్పందన లభించడంతో, విడుదల తేదీ దగ్గర పడుతున్న కొద్దీ సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి.

# కోటి మంది మహిళలకు 'ఇందిరమ్మ చీరలు'

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టాలని ఆదేశించారు:

తొలి దశ (గ్రామీణ ప్రాంతాలు): ఇందిరా గాంధీ గారి జయంతి రోజు నుంచి డిసెంబరు 9 (తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం) వరకు గ్రామీణ ప్రాంతాల్లో పంపిణీ పూర్తి చేయాలి.


రెండవ దశ (పట్టణ ప్రాంతాలు): మార్చి 1 నుంచి మార్చి 8 (అంతర్జాతీయ మహిళా దినోత్సవం) వరకు పట్టణ ప్రాంతాల్లో చీరల పంపిణీని పూర్తి చేయాలి.

చీరల నాణ్యత విషయంలో రాజీ పడొద్దని, మహిళలకు నాణ్యమైన చీరలను అందించాలని సీఎం స్పష్టం చేశారు. సాంకేతికతను వినియోగించుకుని ఇందిరమ్మ చీరల పంపిణీ పారదర్శకంగా జరిగేలా చూడాలని, పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.

**నేడు ప్రారంభం:**

ఇందిరా గాంధీ గారి జయంతి సందర్భంగా బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పించిన అనంతరం ముఖ్యమంత్రి గారు చీరల పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం సెక్రటేరియట్ నుంచి గ్రామీణ ప్రాంత మహిళలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి మాట్లాడనున్నారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందుబాటులో ఉన్న కలెక్టరేట్ల నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశించింది.


# జాతీయ జల పురస్కారాల్లో తెలంగాణ నెంబర్ వన్



**రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రదానం**

బలగం టీవీ, హైదరాబాద్

కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ 6వ జాతీయ జల పురస్కారాలు-2024లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల పనితీరు ఆధారంగా 'జల్ సంచయ్ జన్ భగీదారీ'(జేఎస్ జేబీ) 1.0 అవార్డుల్లో మొత్తం 5,20,362 పనులు పూర్తి చేసిన ఉత్తమ రాష్ట్రంగా తెలంగాణ మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. మంగళవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన అవార్డుల కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా తెలంగాణ పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ శ్రీజన అవార్డు అందుకున్నారు. అలాగే టాప్ 10 మున్సిపాలిటీల్లో రెండో ర్యాంక్ దక్కించుకున్న హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డ్ అవార్డును ఆ సంస్థ ఎండీ కే.అశోక్ కుమార్ రెడ్డి స్వీకరించారు. అంతేకాక పలు విభాగాల్లో మొత్తం పది అవార్డులను తెలంగాణ రాష్ట్రం దక్కించుకుంది.



సౌత్ జోన్‌లో మూడు కేటగిరిల్లో కలిపి మొత్తం ఎనిమిది అవార్డులు దక్కాయి. కేటగిరి 1లో 98,693 పనులతో ఆదిలాబాద్ మొదటి స్థానంలో నిలిచింది. 84,827 పనులతో నల్లగొండ, 84,549 పనులతో మంచిర్యాల ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. కేటగిరి 2లో వరంగల్, నిర్మల్, జనగాం లు వరుసగా మూడు స్థానాల్లో చోటు దక్కించుకున్నాయి. కేటగిరి 3లో భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్ నగర్ లకు అవార్డులు దక్కాయి. ఈ అవార్డులను ఆయా జిల్లాల కలెక్టర్లు అందుకున్నారు. ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, నల్లగొండ అడిషనల్ కలెక్టర్ జే శ్రీనివాస్, మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, వరంగల్ కలెక్టర్ సత్య శారద, నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, జనగామ కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వీ పాటిల్, మహబూబ్ నగర్ కలెక్టర్ విజయేందిర కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ చేతుల మీదుగా అవార్డులను స్వీకరించారు.

నీటి సరఫరా, మురుగునీటి బోర్డు మున్సిపల్ కార్పొరేషన్ల విభాగంలో హైదరాబాద్ మెట్రో కార్పొరేషన్ రెండో ర్యాంకు సాధించింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఏరియాలో జల సంరక్షణ చర్యలు చేపట్టినందుకు గాను రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. రూ.2 కోట్ల నగదు బహుమతిని సొంతం చేసుకుంది. ఈ విభాగంలో కేటగిరీ-2లో వరంగల్, నిర్మల్, జనగామ జిల్లాలు దక్షిణ జోన్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచి రూ.కోటి చొప్పున బహుమతి గెలుచుకున్నాయి. అలాగే, కేటగిరీ-3లో భద్రాద్రి కొత్తగూడెం మొదటి ర్యాంకును సొంతం చేసుకుంది. మహబూబ్‌నగర్ మూడో ర్యాంకులో నిలిచింది. ఈ రెండు జిల్లాలకు చెరో రూ.25 లక్షల చొప్పున నగదు బహుమతి లభించింది. ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కుమురం భీం ఆసిఫాబాద్, మెదక్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాలకు నోడల్ అధికారిగా వ్యవహరించిన కేంద్ర జల సంఘానికి చెందిన ఎ.సతీష్‌కు అత్యుత్తమ ప్రతిభ కనుబరిచినందుకుగానూ అవార్డు దక్కింది.

# పత్తి రైతులకు అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రస్తుతం ఎకరానికి ఏడు క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొంటామంటూ పెట్టిన నిబంధన సరికాదని, దీనిని కచ్చితంగా 13 క్వింటాళ్ల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం ఈ సమయానికి 5 లక్షల క్వింటాళ్లు కొనుగోలు చేసే సీసీఐ, ఈసారి లక్ష క్వింటాళ్లు కూడా కొనుగోలు చేయలేదని రైతులు చెబుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. సీసీఐ నిబంధనల వల్ల క్వింటాలుకు రూ. 8,110 రావాల్సిన రైతుకు కేవలం రూ. 5 వేల నుంచి రూ. 6,200 మాత్రమే వస్తుండడంతో, సుమారు రూ. 3 వేల వరకు నష్టపోతున్నారని కేటీఆర్ వివరించారు.